నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

బుధవారం | సెప్టెంబర్ 18, 2024 | www.navatelangana.com

పెంగింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్, డైలీవైజ్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని నాయకులు కోరారు. అవుట్ సోర్సింగ్, డైలీవైజ్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమశాఖ అభివృద్ధి జిల్లా అధికారి రమాకు వినతిపత్రాన్ని అందించారు. వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, జిల్లా గౌరవాధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య, జిల్లా నాయకులు పెంద్రం శంకర్, అయ్యూబాయి, ప్రమీల, హంసాబాయి, సులోచన, బాపురాబ్, శివరాం పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి జైలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి 5 సంవత్సరాల జైలుతో పాటు రూ. 12 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చినట్టు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. మండలంలోని దిందా గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన దుర్వ భాస్కర్ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ అశ్లీలలను చూపించడంతో బాలిక బయపడి తల్లిదండ్రులకు తెలియజేసింది. 3 నవంబర్ 2020న బాలిక తల్లి ఫిర్యాదు మేరకు చింతలమానపల్లి పోలీస్ స్టేషన్‌లో దుర్వ భాస్కర్‌పైన ఫోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, పీపీ జీవీఎస్ ప్రసాద్ సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయటంతో నిందితుడుకి 5 సంవత్సరాల జైలుతో పాటు రూ. 12,000 జరిమాన విధిస్తూ జిల్లా జడ్జీ తీర్పు ఇచ్చారని ఎస్సై తెలిపారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ ఎం.రమేష్, ఎస్సై నరేష్, కోర్టు కాగజ్‌నగర్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ బాబాజీ, కోర్ట్ సిబ్బందిని ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు.

అభివృద్ధి..సంక్షేమమే ముఖ్యం

- ఆరు గ్యారంటీలను నిక్కచ్చిగా అమలు చేస్తున్నాం
- రుణమాఫీతో 55,879మంది రైతులకు ప్రయోజనం
- సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాం
- ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ
- జిల్లాలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రథమ ప్రాధాన్యమని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. ముఖ్యమంత్రి దార్శనిక పాలనలో విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి కల్పన తదితర అన్ని రంగాలను అభివృద్ధి పథకంలో దూసుకెళ్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు. హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనమైన సందర్భంగా మంగళవార ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చరిత్రలో 1948 వ సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీకి ఒక విశిష్టత ఉందని హైదరాబాదు సంస్థానం భారతదేశంలో ఐక్యమై 77వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న రోజును పురస్కరించుకొని ప్రజాపాలన వేడుకలను నిర్వహించుకుంటున్నామని వివరించారు.

ఆరు గ్యారెంటీలు అమలు

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఆరు గ్యారంటీలను నిక్కచ్చిగా అమలు చేసి తెలంగాణను అభివృద్ధి, సంక్షేమ రాజ్యంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషిచేస్తున్నాయని చెప్పారు. అర్హులైన అందరికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో మహాలక్ష్మి, గృహజ్యోతి, యువ వికాసం, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు వంటి అభయహస్తం గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించామన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన 48 గంటల్లోనే ఆరు గ్యారంటీలలో రెండు హామీలను అమలు చేసి ప్రజల పట్ల తమకు గల అంకితభావాన్ని చాటుకున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జిల్లాలోని ఇంద్రవెల్లి, కేస్లాపూర్‌లలో ఫిబ్రవరి 2న పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారని గుర్తుచేశారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనం అభివృద్ధి పనులకు రూ.కోటి, నాగోబా ఆలయ అభివృద్ధి పనులను రూ.6 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామంలోని 15 మంది అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించడం జరిగిందని తెలిపారు.

పథకాల ద్వారా ప్రయోజనం

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలు లబ్ది పొందుతున్నారని మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 93,63,017మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని ఆహార భద్రత కార్డు కలిగిన వారికి రూ.500 గ్యాస్ సబ్సిడీ కింద 96,115మంది వినియోగించుకుంటున్నారని చెప్పారు. గృహజ్యోతిలో భాగంగ 95,037మంది ఉచిత విద్యుత్తును వినియోగిస్తున్నారని చేయూత కింద రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మూడు విడతల్లో రుణమాఫీతో జిల్లాలో ఇప్పటి వరకు 55,879మంది రైతులకు రూ.608.55కోట్లు జమ చేసినట్లు వివరించారు. వ్యవసాయానికి 24 గంటలు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. ఇందిరా మహిళా శక్తి ప్రోగ్రా కింద రాబోయే ఐదేండ్లలో స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ఇందుకు గాను ఇప్పటికే వారికి రుణాలు అందించి యూనిట్లు నెలకొల్పుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పెన్‌గంగా, చనక-కోర్ట బ్యారేజీ, సాత్నాల, మత్తడివాగు, పులిమడుగు, చిక్‌మాన్, త్రివేణి సంగమం, కుప్టి ప్రాజెక్టులకు నిధులు మంజూరుచేశామని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. రోడ్ల, భవనాలశాఖ ద్వారా రైల్వే ఓవర్ బ్రిడ్జి, తాంసి బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జిల కోసం రూ.97.20కోట్లు మంజూరుచేశామని, ఇచ్చోడలో నాలుగు వరుసల రహదారి కోసం రూ.9కోట్లు మంజూరుచేసినట్లు చెప్పారు. గిరిజన సంక్షేమశాఖ ద్వారా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి గిరిజనుల అభివృద్ధి కోసం కృషిచేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలదేవీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నేత ఏచూరికి నివాళి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం క్రీడాకా మైదానంలో మంగళవారం వాకర్స్ అధ్వర్యంలో ఇటీవల మరణించిన సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశ నుంచి నేటి వరకు నమ్మిన సిద్ధాంతాన్ని వదలకుండా సుమారు 50 ఏళ్లకుపైగా బ్రతికున్నంత కాలం సేవ చేశారన్నారు. దేశంలో ప్రజలను దోసుకునే పాలన వ్యవస్థ పోయి, ప్రజలందరిని సమానంగా, గౌరవంగా చూసే సోషలిస్టు వ్యవస్థను తీసుకురావడం కోసం ఎంతగానో కృషి చేశారని, వారు మరణించడం దేశ ప్రజలకు, కష్టజీవులకు తీరని నష్టమని వారు చూపిన బాటలో ప్రతి ఒక్కరు ప్రయణించాల్సిన అవసరం ఎంతగానో ఉన్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోగే పోశం, రవళి, సంకె రవి, మద్దెల భానేష్, రాజేందర్, అంజన్న, శంకర్, రాజలింగు, రాంచందర్, మనీష్, రవి పాల్గొన్నారు.

లబ్దిదారులకు మహాలక్ష్మి బాండ్ల పంపిణీ



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని చించాల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద మంజూరైన గ్యాస్ సిలిండర్ బాండ్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు దుడ్డు ప్రసాద్ మాట్లాడుతూ లబ్ధిదారులకు బాండ్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ముందుకు వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. పేద ప్రజల ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అమిత, నాయకులు లింగన్న, ప్రకాష్, సాయినాథ్, దమ్మపాల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలో సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌కు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు రావడంతో మంగళవారం స్థానిక నాయకులు షబ్బీర్‌పాషా ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలీంఖాన్, సయ్యద్, ఆయుబ్, మిర్జా బేగ్, కవేటి శ్రీనివాస్, ఎనుముల శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు సరోజ, మమత, ఏఎన్ఎం పుష్ప, మెప్మా నారాయణ, కాలనీ యువకులు పాల్గొన్నారు.

గర్భిణిని ఆదుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన గర్భిణి సీడాం రేణుకబాయి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో 108 పైలట్ ఆత్రం అశోక్, ఈఎంటి కృష్ణ ఆ గ్రామానికి చేరుకుని గర్భిణిని దగ్గరలోని పీహెచ్‌సీకి తరలిస్తుండగా నొప్పులు అధిక మవ్వడంతో ఈఎంటీ ప్రాథమిక చికిత్స అందించడంతో ఆమె అంబులెన్స్‌లోనే పండంటి మగ బిడ్డను ప్రసవించింది. అనంతరం పిట్ట బొంగరం పీహెచ్‌సీకి తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. సకాలంలో గర్భిణీని ఆదుకున్నందుకు కుటుంబీకులు 108 సిబ్బందికి అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని చోర్గావ్, మరప్పగూడ, దేవపటార్ గ్రామాల్లో మంగళవారం హెచ్ఈఓ తులసీదాస్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, 55 మందికి ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. డ్రమ్, టైరు, కులర్‌లో ఉన్న నీటిని పారబోయించారు. చెత్త చెదారం బయట పారేయకుండా వాహనం ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించాలని అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ గణేష్ కుమారి, వైద్య సిబ్బంది విమల, మాన్కుబాయి, ఈశ్వర్, గోకుల్, ఆశా భాగుబాయి, జంగుబాయి, సంగీత, పారుబాయి, గ్రామ పటేళ్లు ఉన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వార్షికోత్సవాల ముగింపు సభ
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో సెమినార్ నిర్వహించారు. దీనికి పార్టీ కార్యదర్శి దర్శనాల మల్లేష్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. విమోచన పేరుతో బీజేపీ ఓట్ల రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ఉత్సవాలు జరపడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీజేపీల చరిత్రను వక్రీకరించకుండా ప్రజలకు పోరాట వాస్తవాలు వివరించాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిందని తెలిపారు. ఇంకా నేటికీ అమరుల ఆశయాలు మిగిలే ఉన్నాయని అన్నారు. భూమిలేని, వెట్టిచాకిరి లేని తెలంగాణ అయినప్పుడు మాత్రమే వారి ఆశయాలు నెరవేరినట్టు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ప్రయత్నించాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, ఆర్.సురేందర్, నాయకులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, పండుగ పొచ్చన్న, ప్రభు, అరిఫా పాల్గొన్నారు.

వ్యర్థాల నుండి ప్రయోజనకర పరికరాలు సృష్టించాలి

- బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-రెబ్బెన

వ్యర్థాల నుండి ప్రయోజనకర పరికరాలు సృష్టించాలని బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత పక్వాడ (స్పెషల్ కాంపెయిన్ 4.0) కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధిపతులు, ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జీఎం ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ స్పెషల్ కాంపెయిన్ 4.0(స్వచ్ఛత) కార్యక్రమాన్ని బెల్లంపల్లి ఏరియాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. స్పెషల్ కాంపెయిన్ 4.0(స్వచ్ఛత) కార్యక్రమాన్ని రెండు విడతల్లో నిర్వహిస్తున్నామని, ఈ నెల 30 వ తేదీ వరకు సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా చేపట్టాల్సిన పనులు, ప్రదేశాలు గుర్తించాలని, అక్టోబర్ 2 నుండి 31 వరకు గుర్తించిన పనులను అమలు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యాలయాలతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వ్యర్థాల నుండి ఉపయోగకర వస్తువులు రూపొందించేలా ప్రతి ఒక్కరి ఆలోచన ఉండాలన్నారు. ఏరియాలోని కార్యాలయాలు విభాగాలు పరిశీలించి పరిశుభ్రంగా ఉన్న డిపార్ట్మెంట్‌కు బహుమతి అందించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్ఓ టూ జీఎం కె.రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేకర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎన్విరాన్మెంట్ అధికారి రమేష్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా తుంపల్లి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛతాహి సేవా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏపీఓ, పంచాయతీ సెక్రెటరీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

- లిబరేషన్ డే ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్ విమోచనం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుందామని ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లిబరేషన్ డే ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎంపీ, ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం చాలా ప్రశంసనీయమన్నారు. చారిత్రాత్మక సంఘటనలన్నింటినీ మనం తెలుసుకోవాలని వాటిని తరువాతి తరాలకు ముందుకు తీసుకెళ్లేలా చూడాలన్నారు. హైదరాబాద్ లిబరేషన్ కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకోవడం నేటి యువతకు చాలా అవసరమని ఈ ఫోటోలు రామ్‌జి గోండు, కుమురంభీం, చాకలి ఐలమ్మ తదితరుల పాత్రను క్లుప్తంగా వివరించడమే కాకుండా, అప్పట్లో జరిగిన వివిధ సంఘటనలు ఫోటో ఎగ్జిబిషన్‌లో తెలియజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

బహుమతులు ప్రధానం...

హైదరాబాద్ లిబరేషన్ డే వేడుకలలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతులు మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. అంతకు ముందు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కళాకారులు చేసిన దీంసా నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డా.అతీక్ బేగం, వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, 32(టీ) బెటాలియన్ ఎన్సీసీ కమాండెంట్ కల్నల్ వికాస్, ఆకాశవాణి ప్రోగ్రాం హెడ్ రామేశ్వర్‌రావు, హెడ్ పోస్ట్ మాస్టర్ కె.ఉత్తమ్ కుమార్, సీబీసీ ఏపీఏ రషీద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రాజీవ్ గాంధీ విగ్రహా ఏర్పాటు సరికాదు'

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు స్థలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం సరికాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించరన్నారు. కానీ రాజకీయ దురుద్దేశంతోనే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టారని ఆరోపించారు. పదేండ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలని ఎందుకు అనిపించలేదని ప్రశ్నించారు. తెలంగాణ తల్లిని అవమానించేలా సీఎం రేవంత్ రెడ్డి వైఖరి ఉందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల మనోభావాలను కించపరిచేలా వ్యవహరించిన ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని, వచ్చె ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తామని అక్కడే తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అజయ్, రమేష్, యూనీస్ అక్బానీ, స్వరూప, నారాయణ, పరమేశ్వర్, తిరుపతి ఉన్నారు.

ఈత చెట్టు మీద నుంచి పడి గీతా కార్మికుడికి గాయాలు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మల్కెపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు రామ గౌడ్ ఈత చెట్టు మీద నుంచి పడి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం ఉదయం రామ గౌడ్ ఈత తాల్లు గీయడానికి వెళ్లగా చెట్టు పైకి ఎక్కి గీస్తుండగా తాడు తెగి కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | సెప్టెంబర్ 18, 2024 | www.navatelangana.com

సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించాలి

నవతెలంగాణ-ఖానాపూర్



రాష్ట్ర సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించాలని నిరసిస్తూ మంగళవారం ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులు తెలంగాణతల్లి చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సచివాలయంలో తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల, పట్టణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్ సీఐ, ఎస్సైలకు సన్మానం

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రిలను మంగళవారం సుభాష్‌నగర్ గణేష్ మండలి వద్ద కాలనీవాసులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ యువకులు భక్తి శ్రద్ధలతో నిమజ్జనం జరుపుకోవాలని సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్‌పాషా, సలీం ఖాన్, ఆయుబ్, మిర్జాబేగ్, గణేష్ మండలి నిర్వాహకులు రాహుల్, శ్రీనివాస్, ఎనుముల నర్సయ్య, శేఖర్, చిన్నూ, శ్రీకాంత్, యువకులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ

- సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేస్తాం
- అక్టోబర్ 28, 29 తేదీల్లో నిర్మల్ పట్టణంలో సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభలు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన కుమార్

నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని వక్రీకరించి, ప్రజల మధ్య చిలికలు తెస్తున్న బీజేపీ విధానాలను తిప్పి కొట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. మంగళవారం ప్రజాసంఘాల కార్యాలయంలో సీపీఐ(ఎం) మండల సమావేశాన్ని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగెల్లి నర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడినరాని అన్నారు. పాలకుర్తి గ్రామంలో చుట్టుపక్కల ప్రజలను చైతన్యపరిచి నైజాం అరాచకాలను, తిప్పుకొట్టడానికి ధైర్యంతో ముందుకెళ్లిన వీరనారి చిట్యాల ఐలమ్మ ధీరత్వము నేటి తరానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులేనిజమైన వారసులన్నారు. మతోన్మాద బీజేపీ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోరాటాన్ని హిందూ ముస్లిం పంచాయతీ లాగా మారుస్తుందన్నారు. చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరని చెప్పారు. కేంద్రంలో అధికారంలోకి మూడో సారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై భారాలు వేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయాలని మోడీ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శులు సభ్యులు బొమ్మెన సురేష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం



విఫలం చెందిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన 6 గ్యరంటీలు ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ డిక్లరేషన్స్ అమలు గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, గంగామణి, మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, వాణి, త్రివేణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

పట్టణంలోని నర్సింహా కళ్యాణ మండపంలో మంగళవారం ఆర్య జనని, ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆధ్యాత్మిక సంస్కారంతో మంచి ఆలోచనలతో భావోద్వేగాలను అదుపు చేసుకొన్నప్పుడే మంచి లక్షణాలు, తేజోవంతులైన, గుణవంతులైన పిల్లలు జన్మిస్తారని తెలిపారు. పౌష్టికాహార మాసంలో భాగంగా పోషకాహారంతో పాటుగా ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీల సంపూర్ణ ఆరోగ్యం కొరకు అంగన్‌వాడీ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పెరేంటింగ్ అంటే చాలామంది పిల్లలు పుట్టిన తర్వాత ప్రారంభమైన ప్రక్రియ అని అనుకుంటారని, కానీ పిల్లల పెంపకం బిడ్డ తల్లి గర్భంలో ఉన్నప్పటినుండే ప్రారంభమవుతుందని, సమాజంలో జరుగుతున్నటువంటి అనేక అనర్థాలను దృష్టిలో ఉంచుకొని గర్భస్థ దశ నుండే తల్లి నుంచి బిడ్డకు సంస్కారాలు అందాలని, గొప్ప మాతృమూర్తులే గొప్ప వ్యక్తులను తయారు చేస్తారు. అన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్యేశమని తెలిపారు. గురుకృపా సంస్థల డైరెక్టర్ శ్రీమతి ముష్కం ప్రసన్న రాణి మాట్లాడుతూ సాధారణ కాన్పు కొరకు మహిళలు ముందస్తు వ్యాయమాలు చేయాలని తెలిపారు. ఆరోగ్యభారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ ఆర్యజనని కార్యక్రమాలు భైంసా వంటి సుదూర ప్రాంతాలలో ఏర్పాటు చేసి సమాజంలో శాంతిని, ఆనందాన్ని పంచి ఇచ్చే తరాన్ని తయారు చేయడం చాలా అవసరమని అన్నారు. వచ్చిన ప్రతి మహిళకు ఆర్యజనని తరపున అత్యధిక పోషక విలువలు కలిగిన లడ్డూల ప్యాకెట్‌ను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ తరపున పోషక విలువలు గల పదార్థాలను ప్రదర్శనలు ఉంచారు. ఈ కార్యక్రమంలో పతాంజలి మహిళా సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు శోభ మాందాని, భైంసా మున్సిపాలిటీ కౌన్సిలర్ తోట విజయ్, బాసర జెడ్పీటీసీ రమేష్, సీనియర్ నాయకులు వెంగళరావు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

విలీనమైనందున ప్రజాపాలన దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో వీలీనం అయిందని, ఆ రోజును పురస్కరించుకొని ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి హోదాలో జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అంతకు ముందు మహనీయుల చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా తెలంగాణ నైజాం పాలనలో ఉండేదన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో వీలినం అయిందని, ఆ రోజును అధికారికంగా జరుపుకునేలా ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించడం జరిగిందన్నారు. అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఇదిలా ఉంటే అటూ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, జడ్పీ సీఈఓ గోపిడి జితేందర్‌రెడ్డి, సుధాకర్, డీపీఆర్‌ఓ తిరుమల, ఆయా శాఖల అధికారులున్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి నాయకులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్, మండల అభివృద్ధి, పశు వైద్యాధికారి, వ్యవసాయ శాఖ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, గ్రంథాలయం, గ్రామపంచాయతీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయపథకాన్ని ఎగురవేశారు. నాటి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం ఉన్నత పాఠశాల విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, పశువైద్యాధికారి దూదిరాం, ఏఓ ప్రమోద్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, జాతీయ జెండాలు ఎగుర వేసిన వారిలో ఉన్నారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తెలంగాణలోని హైదరాబాద్ ప్రాంతం నిజాం కాబంధహస్తాల్లో ఉండేదని, అప్పటి ప్రభుత్వం నిజాం సైన్యంతో పోరాడి హైదరాబాద్‌ను దేశంలోని రాజ్యాలలో విలీనం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 20 నుంచి ప్రజాపాలన కార్యక్రమం మొదలవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సాంకేతిక లోపాలతో రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల అభివృద్ధికి పాటుపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైందని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్ : ప్రజాపాలన దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జవహర్ లాల్, సూపరింటెండెంట్ గంగాసింగ్, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రాజలింగం, డీటీ అమృత్‌లాల్, గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులు ప్రభుత్వ కళాశాలలో, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, జాతీయ జెండాను ఎగురవేశారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ప్రతి ఒక్కరికి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం, తెలంగాణ సాధించడానికి కృషి చేసిన మహనీయులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. మొదటగా ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించి, పోలీసు గౌరవ వందనాల నడుమ జాతీయ పతాకాన్ని సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హైదరాబాద్ రాష్ట్రం 1948 సెప్టెంబర్ 17న భారత దేశ యూనియన్‌లో విలీనమైన సందర్భంగా ఈ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నేటితో 77 సంవత్సరాలు పూర్తి చేసుకొని తెలంగాణ రాష్ట్రం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా సాయుధ దళంలో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ డి వెంకటి ఆధ్వర్యంలో జాతీయ పతకావిష్కరణ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లు కార్యాలయాలలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, బి సురేందర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ హాజరయ్యారు. జిల్లాకు వచ్చిన ఆయనను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మావల మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో పాఠశాలలో కార్యాలయాల్లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్ రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డ్రా.వేదవ్యాస్, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలకించారు అనంతరం వారు మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే తెలంగాణ అన్నారు. హైదరాబాద్ సంస్థాన్ భారత్‌లో సెప్టెంబర్ 17న విలీనమైందన్నారు.

తాంసి : ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాలతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాపాలన దినోత్సవ జెండాలను ఆవిష్కరించారు. ఆయా పోలీస్ స్టేషన్లలో ఎస్సైలు శివరాం, ఖలీం, జెండా ఆవిష్కరించగా తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్‌లు లక్ష్మి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓలు మోహన్‌రెడ్డి సూర్యనారాయణ విద్యా వనరుల కార్యాలయాల్లో మండల విద్యాధికారి శ్రీకాంత్, వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో వైస్ చైర్మెన్ ధనుంజయ్ త్రివర్ణ పతాకాలను ఎగుర వేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముథోల్ : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శివకుమార్, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ మైసజీ, ముథోల్ పంచాయతీ కార్యాలయంలో ఈఓ ప్రసాద్‌గౌడ్, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ సరోజిని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ నారాయణ, జాతీయ జెండాను ఎగురవేశారు.







స్టోన్ క్రషర్ యజమానిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని పిప్పిరి సమీపంలోని స్టోన్ క్రషర్ యజమానిపై చర్యలు తీసుకొని స్టోన్ క్రషర్ క్వారీ గుంతలో పడి మృతి చెందిన సంజన కుటుంబ సభ్యులకు నష్టపరిహారం అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. మంగళవారం పిప్పిరి గ్రామ సమీపంలోని క్వారీని పరిశీలించి, బాధిత కుటుంబీకులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి గత యేడాది బతుకు దెరువు కోసం వచ్చి వారి ముందే ఆనందంగా ఆడుకుంటూ ఉండే సమయంలోనే తన పక్కనున్న క్వారీలోనే మునిగిపోయి చనిపోయిన సంజన తల్లిదండ్రుల కుటుంబానికి రూ.30లక్షల పరిహారం ఇవ్వాలని, క్రషర్ల క్వారీ అనుమతులు ముగిసినప్పటికీ ఇంకా క్వారీ పనులు నిర్వహిస్తున్న క్రషర్ యజమానులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశిష్, వినోద్, మారుతీ పాల్గొన్నారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రానికి సమీపంలోని రామారావు చేను వద్ద సోమవారం రాత్రి వగత్కర్ సంజయ్(28) కూలీ గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ఉమర్‌ఖేడ్ తాలూకా బోరి గ్రామానికి చెందిన సంజయ్ బతుకుదెరువు కోసం గత కొద్ది నెలల కింద మండల కేంద్రానికి వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మృతుడు సంజయ్ సోమవారం ఉదయం నుంచి మద్యం తాగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సోనాల్ కూతురు, కుమారుడు ఉన్నట్టు తెలిపారు. మృతుడి భార్య గత కొద్ది నెలల నుంచి దూరంగా ఉన్నట్లు తెలిసింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే అనిల్ జాధవ్ తెలంగాణతల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం బోథ్ పట్టణంలోని ఆయా గణేష్ మండలపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విశ్వ సృష్టికర్త, ప్రపంచంలోనే మొట్ట మొదటి శిల్పి భగవాన్ శ్రీ విశ్వకర్మ జయంతి వేడుకలలో విశ్వకర్మ మరాఠీ (వడ్రంగి) సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శాంతినగర్‌లోని సంఘం జిల్లా అధ్యక్షులు జాన్వె సంతోష్ ఇంటి వద్ద నిర్వహించారు. ఈ వేడుకలకు బీసీ సంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, కులస్తులు హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. విశ్వకర్మలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని బీసీ సంఘం నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమాల సంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు జాన్వే సంతోష్, దిలీప్, నాయకులు అబయ్, వెంకటి, దేవిదాస్, నాగోరావ్, ప్రమోద్, కాశినాథ్, కిషన్ పాల్గొన్నారు.



కుభీర్ : మండల కేంద్రంతో పాటు పార్డి(బి), సొనారి గ్రామంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేసి గ్రామంలో ఉన్న విశ్వకర్మ సంఘం అధ్యక్షులు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న సంఘం అధ్యక్షులు మాట్లాడారు. విశ్వకర్మలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ కుల సంఘ సభ్యులు లక్ష్మణ్, బ్రహ్మదాస్, రాజన్న, చంద్రకాంత్, లక్ష్మీకాంత్, మాజీ సర్పంచ్ తూము పుష్పాలత రాజేశ్వర్, మడి రమేష్ గ్రామస్తులు ఉన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణతల్లి చౌరస్తాలో స్వర్ణకారుల సంఘం నాయకులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘ పట్టణాధ్యక్షుడు కడార్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బిక్కనూరు ప్రవీణ్, కోశాధికారి ఎనగంటి అజయ్ బులియన్ అధ్యక్షుడు శ్రీపాద వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి దురిశెట్టి భీమేశ్వర్, కోశాధికారి రంగు రవి, నరేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కడార్ల గంగ నర్సయ్య స్వర్ణకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తోగిటి జగన్, స్వర్ణకారుల సంఘం జిల్లా కోశాధికారి లక్ష్మణ్, స్వర్ణకారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, బ్రహ్మం, పిసర రామచందర్ పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురులో ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎటుకూరు శ్రీనివాసరావు ఆడే ప్రకాష్ పాల్గొని ఎన్నికల అధికారిగా జాడి శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, వేతన సవరణ కమిటీ నివేదికను వెంటనే బహిర్గత పరచాలని, ఎంఈఓ పోస్టులను అర్హత గల ఎస్ఏలతో భర్తీ చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా ఇస్లావత్ గుర్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి రవి, అసొసియేట్ అధ్యక్షుడిగా సత్యనారాయణ, మహిళ ఉపాధ్యక్షురాలిగా అనసూయ, కార్యదర్శి వసంత్‌రావు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసాగర్, సీమ, శిరీష, పుష్ప, కవిత పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలో మున్సిపాలిటీ స్థలాల ఆక్రమణలపై మంగళవారం మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు ఫిర్యాదు చేశాడు. ఆక్రమణదారులకు అధికారుల సహకారంతోనే ఈ ఆక్రమణలు జరుగుతున్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 8వ వార్డులో ధోబిఘాట్ స్థలాన్ని కొందరు బోగస్‌పత్రాలు సృష్టించి మున్సిపల్ అధికారుల అండదండలతో ఆక్రమించుకున్నాడని, ప్రస్తుతం పెద్ద షెడ్ నిర్మాణం చేపడుతున్నాడన్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని సర్వే నెం. 147/2, బస్టాండ్ వెనుకభాగంలోని సర్వే నెం. 143లో అనాథలకు ఆశ్రయం కల్పించేందుకు కేటాయించిన మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. సర్‌సిల్క్ డంప్‌యార్డు సైతం కబ్జాకు గురైనందున, వీటన్నింటిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యేనివాసంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు జాతీయజెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా రాజీవ్ చౌక్‌లో కూడా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం జరపాల్సి ఉండగా, ప్రజా పాలన దినోత్సవం పేరిట చరిత్రను వక్రీకరించడం అన్యాయమని అన్నారు. ఈ కారణంగానే తాము జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించే ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు దూరంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నాం

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్
- జిల్లా కేంద్రంలో ప్రజాపాలన దినోత్సవం



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శాసనమండలి డిప్యూటి చైర్మన్ బండ ప్రకాష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తున్నామని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పునరుద్ఘాటించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండేవిఠల్, ఎస్పీ డీవీ.శ్రీనివాస్ రావు, డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టీబ్రీవాల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా హాజరయ్యారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సువిశాల భారతంలో తెలంగాణ అంతర్భాగమైన 60 ఏండ్ల అస్తిత్వ పోరాటం నిజమైన వేళ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసిన ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీమ్ పోరాటాన్ని సగర్వంగా చాటుదామని పిలుపు నిచ్చారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజా పాలన అమలు చేయడంతో పాటు తెలంగాణలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు మరింతగా పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనోత్సవాన్ని సామరస్యంతో జరుపుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తుంపెల్లి వాగు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక నవరాత్రులు పూర్తి చేసుకుని ఘనంగా శోభయాత్ర నిర్వహించి చేపట్టే వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేయడం జరిగిందని, క్రేన్లు అందుబాటులో ఉంచామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. శోభయాత్ర కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులున్నారు.

గణపతి హోమం

రాజంపేటలోని సాయినివాడలో వెలసిన శివ సాయి గణేష్ మండలి వద్ద నిర్వాహకులు శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఈహోమంలో ఐదుగురు అర్చకులు కలిసి వేదమంత్రాల సాక్షిగా హోమం నిర్వహించినంతరం హోమగుండంలో పూర్ణహుతిని సమర్పించారు. ఈ హోమంలో 13 జంటలు పాల్గొన్నాయి. అంతకు ముందు గణేష్ మండపం వద్ద గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు.

నిజాం పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిజాం నిరంకుశ పాలన, భూసాములు, జమీందారులు, జాగిర్దారులు, వెట్టి చాకిరి ముక్తికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో సాయుధ పోరాటల వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూస్వాముల, జమీందారుల, జాగిర్దారుల, వెట్టి చాకిరి విముక్తి కోసం మట్టి మనుషులు చేసిన పోరాటంమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని అన్నారు. ఇందులో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, చాకలి ఐలమ్మ , మఖ్దూమ్ మొయినుద్దీన్, కుమురం భీం జిల్లాలోని కుమురం భీం, రాంజీ గోండు, దాజి శంకర్ కస్తాల రామకృష్ణ, బాసెట్టి గంగారం ఎందరో వీరులు తమ ప్రాణాలను త్యాగం చేసి వెట్టిచాకిరి విముక్తి కోసం సాయుధ పోరాటం చేసిన అమరులయ్యారన్నారు. వారిని స్మరించుకుంటూ నివాళు లర్పించడం బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.తిరుపతి, జిల్లా నాయకులు టి.దివాకర్, రాయిల్ల నర్సయ్య, ఆత్మకూరి చిరంజీవి, శంకర్, సుధాకర్, డోన్నాజీ పాల్గొన్నారు.

దైవిక వాస్తు శిల్పి విశ్వకర్మ : కలెక్టర్

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విశ్వకర్మ నేటి వాస్తు శిల్పులకు ఆదర్శప్రాయుడని దైవిక వాస్తు శిల్పి అని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా బీసీ అధికారి సజీవన్ అధ్యక్షతన నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకలకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి శిల్పులకు విశ్వకర్మ ఆదర్శప్రాయుడన్నారు. ఆర్కిటెక్చర్ అభివృద్ధి చెందని సమయంలో గొప్ప నైపుణ్యంతో ఎన్నో రాజ భవనాలు నిర్మించిన గొప్ప నైపుణ్యకారుడని కొనియాడారు. ఇంజనీరింగ్ వృత్తిదారులకే కాకుండా చేతివృత్తి కళాకారులు కూడా ఈయనను అనుసరించారన్నారు. అటువంటి మహనీయుని జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాబాపూర్ ఆలయంలో..

మండలంలోని బాబాపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామ విశ్వకర్మ కమిటీ ఆధ్వర్యంలో పూజారి తిరుపతి చారి నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా జయంతి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో వినోద్, మహేందర్, రమేష్, సంతోష్, సుభాష్, రాజన్న, బక్కయ్య పాల్గొన్నారు.

దహెగాం : మండల కేంద్రంతో పాటు కోట్మీర్ తదితర గ్రామాల్లో మంగళవారం ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. జయంతి సందర్భంగా జెండా ఎగురవేశారు. అనంతరం విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ హక్కుల సాధనకోసం అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ కులస్తులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని విశ్వకర్మ ఆలయంలో మంగళవారం విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవారం ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. భక్తిశ్రద్ధలతో హోమ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుష్పలత విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు ఏలేశ్వరం పురుషోత్తం, శ్రీకాంత్, శ్రీధర్, మోహన్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

రెబ్బెన : గోలేటి గ్రామంలో కోరుట్ల యాదవ చారి సిరికొండ రామయ్య చారి ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ముఖ్య అతిధులుగా జిల్లా అధ్యక్షులు పాంచాలపు లక్ష్మణాచారి, జిల్లా కార్యదర్శి నల్లగొండ సదాశివ చారి హాజరయ్యారు. కార్యక్రమంలో గద్దల పెల్లి హరీష్ చారి(అయ్యగారు), ఉప్పుల నరసింహ్మా చారి, వాలవోజు కిషన్ చారి, ఉట్నూరి సత్తెయ్య చారి, అనుముల రమేష్ చారి, చాకటి అశోక్ చారి, వెలిశాల అంజయ్య పాల్గొన్నారు.



బెజ్జూర్ : జయంతి సందర్భంగా సన్మానిస్తున్న సంఘం నాయకులు



దహెగాం : పూజలు చేస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

రవాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈనెల 22, 23 తేదీల్లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ ప్రయివేట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)రాష్ట్ర మహాసభలు కొత్తగూడెంలో జరిగే మహాసభ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో మోటార్ వాహనాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 1969 సంవత్సరంలో మొట్టమొదటిగా ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ స్థాపించామన్నారు. 55 సంవత్సరాల నుంచి నేటి వరకు అనేక కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. సుమారుగా 20 లక్షల మంది రవాణ రంగంలో పని చేస్తున్నారని, బడుగు బలహీన వర్గాలకు చెందిన కార్మికులని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మరణించిన ఆటో డ్రైవర్లకు ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల చెల్లించాలని కోరారు. కొత్తగూడెంలో జరిగే మహాసభలకు సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజుతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ నాయకులు బొంగు నరసింహారావు, రాజాగౌడ్, వెంకన్న గౌడ్, అరికిల్ల స్వామి, నందు, నగేష్, గణేష్, దేవయ్య రాజ్, కిషోర్ పాల్గొన్నారు.



ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను మంగళవారం కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశాన్ని ప్రపంచ యవనిక మీద గురుస్థానంలో నిలబెట్టే ప్రధాన బాధ్యతను ప్రధాని మోదీ తీసుకున్నారని అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో నూరేళ్ల జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, అరుణ్ లోయ, సిందం శ్రీనివాస్, దోని శ్రీశైలం, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, వీరభద్రచారి, దెబ్బటి శ్రీనివాస్, మనోహర్‌గౌడ్, కొప్పుల శంకర్, శ్రీదేవి, మోహిని, రాణి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల కార్మికులకు వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ ఆదర్శ పాఠశాల వసతి గృహాలలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణమచారి అన్నారు. మంగళవారం ఇన్‌చార్జి డీఈఓ ఉదయ్ బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్, సిర్పూర్(యు) ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న కార్మికులకు 6 నెలల నుండి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వారికి వెంటనే చెల్లించాన్నారు. 9 సంవత్సరాలుగా చాలిచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ కూడా చెల్లించడం లేదని తెలిపారు. పెండింగ్ వేతనాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు సీహెచ్ రేఖ, కవిత, సంగీత పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన వేడుకలు



ఆసిఫాబాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాపాలన దినోత్సవం వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి కలెక్టర్ వెంకటేష్ ధోత్రే జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ తోటాజీ, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ భుజంగరావ్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. బీఆర్ఎస్ భవన్‌లో తెలంగాణ సమైక్యత దినోత్సవం పేరుతో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు పోచయ్య, మహమ్మద్ పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవాన్ని తహసీల్దార్ మహమ్మద్ రియాజ్ అలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కొమురయ్య, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అల్బర్ట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి హర్షిణి, పశు వైద్యశాలలో పశు వైద్యాధికారి రాకేష్, కేజీబీవీలో ప్రత్యేకాధికారి కవిత, ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.



పెంచికల్‌పేట్

బెజ్జూర్ : మండలంలో ప్రజా పాలన దినోత్సవం మంగళవారం ప్రజాప్రతినిధులు అధికారులు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మేశ్వర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. మండల పరిషత్ కార్యాలయం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై, ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి మిఠాయిలను పంచారు. గ్రామపంచాయతీలో కాంగ్రెస్ నాయకులు రాచకొండ శ్రీవర్ధన్ ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి తుకారం పాల్గొన్నారు.

కౌటాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జెండా ఎగురవేసి వందనం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కోటప్రసాద్, పోలీస్ స్టేషన్‌లో సీఐ ముత్యం, రమేష్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సాయి కృష్ణ, సహకార సంఘం కేంద్రంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య జెండా ఆవిష్కరించారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామ పంచాయతీలు, పాఠశాలలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ త్రివర్ణ పథకాన్ని ఎగరవేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ముష్కర్ అలీ, మండల కార్యాలయంలో ఎంపీడీఓ కోట ప్రసాద్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఇస్లావత్ నరేష్ జెండాలను ఎగరవేశారు.

కాగజ్‌నగర్ : రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో సంఘం ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎం జయదేవ్ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.



బెజ్జూర్



కౌటాల



చింతలమానేపల్లి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | 18 సెప్టెంబర్, 2024 | www.navatelangana.com

టేకుమట్లలో సామాజిక తనిఖీ

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని టేకుమట్ల గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వార చేపట్టిన పనుల నిర్వాహణకు సంబంధించి సామాజిక తనిఖీ గ్రామ సభ ఏర్పాటు చేశారు.. 14వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, జైపూర్ ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన 11 పనుల నివేధికలను సభలో చదివి విన్పించగా సామాజిక తనిఖీ సభ్యులు గుర్తించిన లోటుపాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీ వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

లక్కీడ్రాలో లడ్డు..

● దక్కించుకున్న మంచిర్యాల యువకుడు

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల జిల్లా కేంద్రంలో గల అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డు లక్కీ డ్రా మంగళవారం నిర్వహించారు. కూపన్‌ల ద్వారా నిర్వహించిన లక్కీ డ్రాలో మంచిర్యాల జిల్లా కేంద్రనికి చెందిన చిందాం చరణ్ తేజ 111 కిలోల అంజనీపూత్ర లడ్డును దక్కించుకున్నాడు. 12 వేల టోకెన్‌లలో తాను లక్కీ డ్రా ద్వారా వినాయకుడి లడ్డును పొందడం సంతోషంగా ఉందని చరణ్ తెలిపారు. కార్యక్రమంలో అంజనీపూత్ర చైర్మన్ గుర్రాల శ్రీధర్, డైరెక్టర్‌లు పిల్లి రవి, అంజనీ పుత్ర సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు

నవతెలంగాణ-నస్పూర్

దేశం కోసం రాష్ట్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకలకు కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, జిల్లా అటవీ అధికారి శిక్‌ఆశిష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్సాగర్రావు, గడ్డం వినోద్‌లతో కలిసి హాజరై గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని, అమరవీరులు చేసిన పోరాటాల ఫలితంగా నేడు మనం స్వేచ్ఛను అనుభవిస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని, ప్రజలకు హామీ ఇచ్చిన 6 గ్యారంటీల అమలు కోసం అధికార యంత్రాంగంతో కలిసి నిరంతరం పని చేస్తుందని అన్నారు. అంతకు ముందు జిల్లా పరిషత్ కార్యాలయ భవన సముదాయంలో కలెక్టర్ కుమార్ దీపక్, జడ్పీ సీఈఓ గణపతితో కలిసి ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో భాగంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జైపూర్ : మండలంలో ప్రజా పాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వనజారెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యనారాయణ, వ్యవసాయ కార్యాలయంలో



వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ జాతీయ జెండాలు ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. భీమారం ఎంపీడీఓ కార్యాలయంతో పాటు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉధ్యానవన శాఖ అధికారి కల్పన జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.

లక్షెట్టిపేట : తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా తహసీల్దార్ చేతుల మీదుగా జాతీయ జెండా ఎగురవేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లక్షెటిపేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజా పాలన దినోత్సవం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఏ దిలీప్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అమరవీరులకు, వారి త్యాగాలను స్మరించుకుని జాతీయ గీతం, తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ మడిపల్లి స్వామి, రంజిత్ సింగ్, కాంగ్రెస్ నాయకులు, కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం : తహశీల్దార్ కార్యా యం ఎదుటు తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి మంగళవారం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రతి గ్రామపంచాయతీలో జాతీయ జెండాను ఆయా గ్రామాల కార్యదర్శి ఆవిష్కరించారు. ప్రజా పాలనలో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఏపీఓ రవీందర్ పాల్గొన్నారు.

హాజీపూర్ : ప్రజాపాలన దినోత్సవ వేడుకలు మంగళవారం హాజీపూర్ మండలంలో ఘనంగా నిర్వహించారు. దేశం కోసం, రాష్ట్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని, అమరవీరుల పోరాటల ఫలితంగా నేడు మనం స్వేచ్ఛను అనుభవిస్తున్నామని ఈ క్రమంలో ప్రభుత్వం కూడా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని అతిథులు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్పాండే జాతీయ పతాకాన్ని ఎగురవేయగా నాయబ్ తహసీల్దార్ హరిత, ఆర్ఐ మంగ, ప్రభు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీపీ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి డీఈఓ యాదయ్య జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎంపీడీఓ మధుసూధన్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య పాల్గొన్నారు. గుడిపేటలోని 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకటరాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.


జైపూర్‌లో..


లక్షెట్టిపేటలో..


జన్నారంలో..

సింగరేణి రక్షణకు నడుంబిగించండి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి రక్షణకు కార్మికులంతా నడుం బిగించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల జోక్యం వలన సంస్థ ఉనికికే ప్రమాదంగా మారిందని విమర్శించారు. సింగరేణి సంస్థ నియమ, నిబంధనలకు విరుద్ధంగా పనిచేయాలని అధికారులపై కొందరు మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు ఆయన ఆరోపించారు. సంస్థ అభివృద్ధి, విస్తరణ కోసం కాకుండా వ్యక్తిగత పనులు చేయాలని ఇచ్చిన ఆదేశాలను పాటించని అధికారులపై వేటుకు సిద్ధపడటం దుర్మార్గమని ఆయన అన్నారు. సింగరేణిలో జనరల్ మేనేజర్ స్థాయి అధికారులను తీవ్ర పదజాలంతో దూషిస్తున్న కొందరు ఎమ్మెల్యేల తీరును ఆయన తప్పు పట్టారు. గత పాతికేళ్లుగా సింగరేణి స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా గెలిచిన కార్మిక సంఘం సూచన మేరకు నియమించేవారని, ప్రస్తుతం ఎమ్మెల్యేలు సిఫారసులేఖలు ఇవ్వడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. కొత్తగా బదిలీ వర్కర్లుగా సంస్థలో చేరిన ఉద్యోగులను సర్ఫేస్‌లో పని కల్పించాలని అధికారులపై ఒత్తిడి చేయడం తగదని హితవు పలికారు. మెడికల్ బోర్డులో భారీ ఎత్తున అవినీతి జరుగుతున్నదని, అధికారుల పోస్టింగులలో కూడా ప్రజాప్రతినిధుల జోక్యం పెరిగిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు, క్వార్టర్ల కేటాయింపులో కూడా ప్రజాప్రతినిధులు నేరుగా అధికారులను ఆదేశించడం శోచనీయం అని అన్నారు. సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం అవుతున్నాయని పేర్కొన్నారు. బదిలీ వర్కర్‌తో పాటు ఇతర ఉద్యోగ నియామక పత్రాలు ముఖ్యమంత్రి చేతుల మీదగా ఇప్పించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఇటీవల కాలంలో సింగరేణి సంస్థ చేపట్టే ప్రతి పనిలో ప్రజాప్రతినిధుల జోక్యం వలన అధికారులు స్వతంత్రంగా, నిర్భయంగా సంస్థ అభివృద్ధి కోసం పనిచేయలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు.

సంస్థ లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వాటా ఇవ్వాలి



నవతెలంగాణ నస్పూర్

సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వాటాను కేటాయించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూ యు-ఐఎఫ్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. మంగళవారం కృష్ణ కాలనీలోని సివిక్ కార్మికుల వద్ద మాడుగుల కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థకు కోట్లల్లో లాభాలు వస్తున్నప్పటికీ సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాను కేటాయించడం లేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచుతామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎన్నికల ముందు కొన్ని ప్రాంతాలలో హామీలు ఇచ్చారని, నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల, సౌకర్యాల పైన ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్, రాజన్న, తిరుపతి, కృష్ణ, హంస, గౌరమ్మ, మేరీ, సుజాత పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం సరికాదు'

నవతెలంగాణ-జన్నారం

అసెంబ్లీ ముందు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టే స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం సరికాదని మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపాన ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టాల్సిన పాలకులే ఇలా చేయడం సరికాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన 6 గ్యారెంటీ స్కీంలను అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు మండల మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్ చింతగూడ పీఏసీఎస్ చైర్మన్ నాసాని రాజన్న, సత్తుపల్లి సత్యం, ఫజల్ ఖాన్, సిటిమల భరత్ కుమార్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్ రాగుల శంకర్, బోర్లకుంట ప్రభుదాస్, సృజన్ ఐలవేణి రవి, వెంకటేష్, దుమలరెడ్డి ,లెక్కల మల్లయ్య పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో స్వచ్ఛత సంస్థాగత మొదలైంది



నవతెలంగాణ-జైపూర్

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, పరిపాలనా సంస్కరణలు ప్రజా పిర్యాదుల శాఖ ఆదేశాల మేరకు జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో స్వచ్ఛత సంస్థాగత మొదలైంది. ఈ మేరకు ప్లాంట్ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ హెడ్ ఆఫ్ ది ప్లాంట్ ఎస్వీ రాజశేఖర్ రావు మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాంట్ పరిపాలనా భవనంలో చేపట్టిన 4.0 ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం స్వచ్ఛత సంస్థాగతీకరించడంలో భాగంగా ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైల్స్‌ని తగ్గించడం అదేవిధంగా ఆఫీసుల పరిశుభ్రంగా ఉంచుకోలనే ఉద్దేశంతో ఈ స్వచ్ఛత కార్యక్రమాలను గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, పరిపాలన సంస్కరణలు, ప్రజా పిర్యాదుల శాఖ (డీఏఆర్‌పీజీ) ఆదేశాల మేరకు నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. కాగా ప్రపంచంలోని ఏ దేశంలోనైనా పరిశుభ్రత కన్పిస్తుందంటే దానికి కారణం ఆ దేశ ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవడమే అన్నారు. మనం పరిశుభ్రంగా ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇతరులను అపరిశుభ్రత చేయకుండా చూసుకోవాలని తెలిపారు. వారానికి 2 గంటలు సంవత్సరంలో 100 గంటలు పరిశుభ్రతకు కెటాయిస్తే పరిశుభ్ర తెలంగాణ ఏర్పడుతుందని తద్వార స్వచ్ఛ భారత్ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్భంగా ప్లాంట్ అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం (పీసీఎస్) శ్రీనివాసులు, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ ప్రసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏజీఎం (సివిల్) ప్రసాద్, ఏజీఎం (ఫైనాన్స్) సుధాకర్, ఏజీఎం(ఈఅండ్ఎం) మదన్‌మోహన్, డీజీఎం(పర్యావరణం) వాసుదేవ మూర్తి, ఎస్వోటూ ఈడీ ప్రభాకర్ సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

నవతెలంగాణ-జన్నారం

మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినం మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన జాతీయ జెండాను మండలాధ్యక్షుడు గుండవరపు మధుసూదనరావు ఆవిష్కరించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రుల్లోనే రోగులకు పండ్లు బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. తిమ్మాపూర్‌లో మాజీ ఎంపీటీసీ దర్శనాల వెంకటస్వామి ఆధ్వర్యంలో బీజేపీ గ్రామ కమిటీ నాయకులు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య ప్రధాన కార్యదర్శిలు ఎరుకల రమేష్ గౌడ్ గొల్లపెల్లి దేవేందర్ పట్టణ అధ్యక్షుడు రాగుల సూర్యం మాజీ అధ్యక్షులు వీరాచారి మండల కార్యదర్శి అప్పాల జలపతి దిలీప్, చిట్టిబాబు, భాస్కర్, ధర్మరాజు, కూకటికారి శంకర్, నాడెం శ్రీనివాస్, యగంధర్, మల్లికార్జున్, భూమేష్ శంకర్, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



నవతెలంగాణ-నస్పూర్

వాస్తు శిల్పి, ప్రతిమశాస్త్ర పితామహుడు విరాట్ విశ్వకర్మ అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్‌తో కలిసి హాజరై విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనకరంగా వాస్తు ప్రకారం పట్టణాలు, భవనాల నిర్మాణాలు చేపట్టి అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు, మన సంస్కృతిలో విగ్రహాల రూపకల్పనపై భావితరాలకు దిశానిర్దేశం అందించిన మహనీయుడు విరాట్ విశ్వకర్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, జిల్లా శాఖల అధికారులు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి శ్రీనాథ్చేరి, ప్రధాన కార్యదర్శి రావుల హరీష్చరి, రాష్ట్ర విశ్వకర్మ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలికోజు నర్సింహాచారి, ఓబీసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగన్నపేట విజయ్కుమార్చారి పాల్గొన్నారు.

జన్నారం : విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంగం మండల నాయకులు మంగళవారం విశ్వకర్మ జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన విశ్వకర్మ జెండాను ఆవిష్కరించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వకర్మ మండల అధ్యక్షులు కడారుల నరసయ్య, దామోదు శ్రీనివాస్, కొత్తపెల్లి శ్రీనివాస్, జయకరు శ్రీరాముల రమేష్, నర్సింగ్, రోజు శ్రీనివాస్ జయకర్ నరేష్ శ్రీనివాస్ వెంకటపతి శంకరాచారి మొగిలి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.



టీచర్ల బదిలీపై విద్యార్థుల ఆందోళన

● డీఈఓ చొరవతో విరమణ

నవతెలంగాణ-మందమర్రి



ఉపాధ్యాయుల బదిలీపై ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాఠశాల ఎదుట ఆందోళనకి దిగారు. డీఈఓ యాదయ్య చొరవతో సద్దుమనిగిన ఆందోళన. పాఠశాల ఉపాధ్యాయులందరూ ఒకేసారి బదిలీ కావడంతో మంగళవారం విద్యార్థులు పాఠశాల ఎదుట ఆందోళన చేస్తూ తరగతులను బహిష్కరించి నినాదాలు చేశారు. తల్లిదండ్రుల తర్వాత గురువులను మార్గదర్శకులుగా భావిస్తారు. కాస్త ప్రేమ చూపే ఉపాధ్యాయులపై మమకారం పెంచుకుంటారు. వారు ఒక్కరోజు పాఠశాలకు రాకపోయినా ఆరా తీస్తారు. అలాంటిది ఏకంగా పాఠశాల నుండి బదిలీ కావడంతో ఒప్పుకోమంటున్నారు. పాఠశాలలో పనిచేసిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణితం బోధించే జయకృష్ణరెడ్డి ఉపాధ్యాయుడంటే పిల్లలందరికీ ఎంతో ఇష్టమని, పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండే వారని విద్యార్థుల పేరెంట్స్ తెలిపారు. అయితే మూడు రోజుల క్రితం సర్దుబాటులో భాగంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో పాటు అందరినీ బదిలీ చేశారు. ఈ విషయాన్ని విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. 'మా టీచర్‌లు మాకే కావాలి అకాడమిక్ ఇయర్ మధ్యలో బదిలీ చేయొద్దు' మమ్మల్ని మోసం చేయొద్దు అంటూ నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఎస్ఐ రాజశేఖర్ నూతన ప్రిన్సిపాల్ సారా తస్నీం విద్యార్థులను ఎంత సముదాయించిన తమ టీచర్‌లను ఇక్కడే కొనసాగించాలని తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ విషయంపై డీఈఓ యాదయ్యను చరవాణిలో సంప్రదించగా వారు స్పందిస్తూ నిబంధనల మేరకే బదిలీలు జరిగాయని బదిలీ ప్రక్రియను పున్ణ పరిశీలిస్తామని విద్యార్థులతో చెప్పడంతో ఆందోళనను విరమించుకున్నారు. ఇదిలా ఉండగా గతంలో పాఠశాలలో పని చేసిన ముఖ్యమైన వారు కొందరు విద్యార్థులు వారి తల్లితండ్రుల సహకారంతో పథకం ప్రకారమే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రక్రియకి తెరలేపినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని జడ్పీ ఎస్ఎస్ బాలిక పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనకు దిగారు. పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు విద్యార్థులపై దుర్భాషలాడుతూ, వారిని మానసికంగా వేధిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తరగతి గదిలో లేనిపోని మాటలతో దుర్భాషలాడుతుందని, తరగతిలో చెప్పే లెసన్స్ కూడా అర్థం కావడం లేదని వాపోయారు. వెంటనే సంబంధిత ఉపాధ్యాయురాలిని కాకుండా మరో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలుని పంపించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు ప్రధానం

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని నమ్నూర్ పునరావాస కాలని 7వ నెంబర్ రోడ్డులోని శ్రీలక్ష్మి గణేష్ మండలి వద్ద లక్కీ డ్రా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేష్, నంనూర్ పంచాయతీ కార్యదర్శి సంధ్యలు మంగళవారం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి సైకిల్ మేరుగు సమీక్ష, రెండవ బహుమతి ప్రెషర్ కుక్కర్ హాట్ బాక్స్‌ను ఉడే రాజ్ కుమార్, మూడవ బహుమతిటీ ఫ్లాస్క్ కప్స్ సాయి కుమార్ లు గెలుపొందారు. ఈ సందర్భంగా ఎస్ఐ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలు నాటాలి

నవతెలంగాణ-జన్నారం

పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పోన్కల్ గ్రామ పంచాయతీ ఈఓ రాహుల్ కోరారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో పలు శాఖల అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంచే శక్తి మొక్కలకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రవీందర్, ఏఈఓ త్రిసంధ్య పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా లక్షెట్టిపేటలో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంల ఊత్కూర్ చౌరస్తాలో సీపీఐ సీనియర్ నాయకుడు దుర్గం దేవన్న జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మేదరి దేవవరం, సహాయ కార్యదర్శి కేతిరెడ్డి రమణారెడ్డి, లింగంపల్లి భానుచందర్, రాచర్ల రవికిరణ్, ఆకుల రామన్న పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా పాలనా దినోత్సవం

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఈ సంధర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు..

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రావి చెట్టు వాడ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో విశ్వకర్మ భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించుకున్న వేడుకల్లో మండల అధ్యక్షుడు గర్రెపల్లి సత్యనారాయణ, అర్చకులు నూతి మధులతో కలిసి విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అన్న ప్రసాదాలు, సామూహిక భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రహ్మణ సంఘం నాయకులు మేరడిగొండ మురళి, యూత్ అధ్యక్షులు పూసాల రుద్ర శర్మ పూసాల శ్యాం సుందర్, పూసాల రాజు, చెన్నోజు మనోహర్, నాంపల్లి రమేష్ చారీ, దేవరకొండ మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | సెప్టెంబర్ 18, 2024 | www.navatelangana.com

హద్దురాళ్లు వేసేదాక మొరం ముట్టకండి

నవతెలంగాణ-లక్సెట్టిపేట



హద్దురాళ్లు వేసేదాక మొరం ముట్టకండి అని మున్సిపల్ పరిధిలోని ఇటిక్యాల్ చెరువులో కబ్జాలో ఉన్న బాధితులు అన్నారు. చెరువులో ఉన్న కబ్జాదారుల ఫ్లట్స్‌లో పోసుకున్న మోరంను మంగళవారం మున్సిపాల్ అధికారులు జేసిబి ట్రాక్రర్ల తో రవాణా చేస్తున్న విషయం తెలుసుకున్న కబ్జాదారులు అక్కడికి వచ్చి ఎఫ్‌టీఎల్, బఫ్ఫార్ జోన్ అద్దురాళ్లు వేసేదాక మొరం తీయకుండా అడ్డుపడ్డారు.

హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్ ఓపెనింగ్ మేళాకు స్పందన

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియా గోలేటి సీఈఆర్ క్లబ్ లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్ ఓపెనింగ్ మేళాను ఎస్‌ఓ టూ జీఎం కె రాజమల్లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒప్పంద ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఇటీవలే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో సింగరేణి యాజమాన్యం ఒప్పందం చేసుకుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.30 లక్షల వరకు బీమా సౌకర్యం, జీరో బ్యాలెన్స్ అకౌంటు వంటి వివిధ రకాలు ప్రయోజనాలున్నాయన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ఎం శ్రీనివాస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధి ప్రవీణ్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించారు. అండర్-14, 17 విభాగాలలో బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహించిన పోటీలలో జోనల్ స్థాయి జట్లను ఎన్నుకున్నారు. ఎంపికైన జట్ల వివరాలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, ఫాతిమా కాన్వెంట్ ప్రిన్సిపాల్ సాఫల్య ప్రకటించారు. అండర్-17 బాలుర విభాగంలో కార్తీక్ మిశ్రా, అనూజ్‌కుమార్ రజక్, బి అభిరాం, నీలేష్ గుప్తా, ఆర్ సహృదయ్, బాలికల విభాగంలో ఎస్ శ్లోక, బల్వోత్రా నైనా, సీహెచ్ హరిప్రీత్‌కౌర్, ఫసియా తహసీన్, అండర్-14 బాలుర విభాగంలో ఎం ప్రీతమ్, కె నితీష్ కుమార్, పి అఖిల్, రిషబ్ జైన్, బాలికల విభాగంలో శృతి గుప్తా, ఎస్ యశస్విని, స్వాతి రాయ్, జె శివాని, మైత్రి గుప్తాలు ఎంపికయ్యారు. వీరు త్వరలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు కృష్ణప్రసాద్, ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలతో విద్యార్థులకు అన్యాయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదేండ్ల తర్వాత రాష్ట్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలల బోధనా సిబ్బందీని బదిలీ చేస్తూ విద్యాశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసిందని ఈ బదిలీలతో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. మంగళవారం బదిలీలను నిలిపివేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ మల్లెపూల మధుకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్, సిర్పూరు(యు) లాంటి మారుమూల ప్రాంతాల ఆదర్శ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు బదిలీపై వెళ్లి పోతే బయటి నుంచి ఎవరూ ఇక్కడికి రాక పోవడంతో పోస్టులన్నీ ఖాళీ అయ్యాయని తెలిపారు. విద్యా సంవత్సరం మధ్యలో వదిలి వెళ్లడంతో పాఠశాలలో విద్యానభ్యసిస్తున్న పది, ఇంటర్ విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి ఉన్నారు.

ఉచిత కంటి శిబిరానికి స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 40 మంది హాజరు కాగా ఇందులో 19 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్‌క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలి



నవతెలంగాణ-తాండూర్

తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపరాణి తెలిపారు. మంగళవారం రేచీని పంచాయతీలోని అన్నారం గ్రామంలో పోషణ మాసాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే డాక్టర్లు సంప్రదించాలని తెలిపారు. పిల్లల ఎత్తు బరువును కొలిచారు పిల్లలకి వయసుకు తగ్గట్టుగా మంచి పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

సెప్టెంబరు 17 ముమ్మాటికి విద్రోహమే

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్



నవతెలంగాణ-ఖానాపూర్

సెప్టెంబర్17 ముమ్మాటికి విద్రోహ దినమేనని ఇది చరిత్రను వక్రీకరించడమే పాలకుల ఎత్తుగడని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1946 నుంచి 1951 వరకు జరిగిందని, ఈ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 3000 గ్రామాలు విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో పంచడం జరిగిందన్నారు. ఈ పోరాటంలో 4,000 మంది అమరవీరులయ్యారని, తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం పోరాడాడని అన్నారు. చరిత్రను మరచిన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అమరవీరుల త్యాగాలను, పోరాటాలను పక్కదోవ పట్టిస్తూ, విలీనమని విమోచనమని అన్నారు. పోరాడిన పోరాటాలను పాలకులు వక్రీకరిస్తున్నారని అన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సెప్టెంబర్ 17 పోరాటాన్ని విద్రోహ దినంగా పాటించాలని కోరుతూ విద్రోహ దినంగా పాటించామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, ఆకుల సత్తన్న పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : సెప్టెంబర్ 17 ముమ్మాటికి విద్రోహ దినమేనని ఇది చరిత్రను వక్రీకరించడమే పాలకుల ఎత్తుగడని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకట నారాయణ అన్నారు. మంగళవారం కుమురంభీం భవనంలో సెప్టెంబర్17 విద్రోహ దినం కార్యక్రమంలో బి.వెంకటనారాయణ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1946 నుంచి 1951 వరకు జరిగిందన్నారు. ఈ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 3వేల గ్రామాలు విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో పంచడం జరిగిందని పేర్కొన్నారు. ఈ పోరాటంలో 4,000 మంది అమరవీరులైనరని పేర్కొన్నారు. తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య భూమి కోసం, భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం పోరాడాడని అన్నారు. చరిత్రను మరచిన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అమరవీరుల త్యాగాలను, పోరాటాలను పక్కదోవ పట్టిస్తూ, విలీనమని, విమోచనమని నేడు తన పోరాడిన పోరాటాలను పాలకులు వక్రీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వామన్, గంగమ్మ, మడావి గణేష్, శ్యామ్, మనోజ్, తౌఫీక్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో...

భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం వీరోచితంగా పోరాడి తమ అమూల్యమైన ప్రాణాలను బలి తీసుకున్న రోజు సెప్టెంబర్ 17 విలీనం కాదని, విమోచన దినం కాదని ముమ్మాటికి తెలంగాణ విద్రోహ దినమేనని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగన్ సింగ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కుమురంభీం భవన్, మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్తూపానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జగన్‌సింగ్ మాట్లాడుతూ భూస్వామ్య, రాచరిక బానిసత్వంపై తిరగబడి, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిందే వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభం కావడానికి తొలి అమరత్వం పొందిన వాడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమ్ర అశోక్, సిడం సాయికుమార్, గారె రాములు, రాము, కొడప సురేష్, మడావి రేణుక, వనిత, భాస్కర్ పాల్గొన్నారు.



సాయుధ పోరాటాలతోనే స్వేచ్ఛ స్వాతంత్ర్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సాయుధ పోరాటం ద్వారానే ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభించాయని, కానీ తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రను పాలకులు వక్రీకరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నళినిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విమోచన దినోత్సవం పేరిట బీజేపీ చేపట్టే కార్యక్రమాలు ప్రజలను మభ్య పెట్టేందుకేనని అన్నారు. నైజాం వ్యతిరేక పోరాటంలో బీజేపీ పాత్ర ఏమాత్రం లేదన్నారు. తెలంగాణ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన గొడవగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని, ట్యాంక్ బండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్య పుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన ప్రభుత్వం ఎందుకు ఆ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, అరుణ్ కుమార్, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనాఖాన్, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్ధాంగి రమేష్, ఖండాల గణేష్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ పాషా, బెజ్జంకి నర్సింగరావు, కృష్ణవేణి, సంగీత పాల్గొన్నారు.

కాసిపేట : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి దాగం మల్లేష్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుంటూ నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కాసిపేట మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ నిజాం రాచరిక పాలనకు, కరుడు గట్టిన భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా సాగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ వాస్తవ చరిత్రను చీకటి పొరల్లోకి నెట్టాలనుకుంటున్న బీజేపీ ఆటలు సాగనీయమన్నారు. 1956 వరకు గవర్నర్‌గా నిజాం ఉన్నాడు మరి అలాంటప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు హైదరాబాద్ సంస్థానం విమోచన జరిగిందని ఎలా చెబుతారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు భాష్యాలు చెబుతూ ఇది హిందూ ముస్లింలకు జరిగిన ఒక సంఘర్షణగా చిత్రీకరించే దుష్ప్రచారాన్ని సీపీఐ పార్టీ ఎదుర్కొంటూ వాస్తవ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్తున్నదని, దేశ స్వాతంత్ర పోరాటానికి, హైదరాబాద్ సంస్థానంలో జరిగిన భూస్వామ్య నిరంకుశ పాలనకు ఏనాడు మద్దతు తెలుపకుండా పాలకవర్గాలకు వత్తాసు పలికిన ఆర్ఎస్ఎస్ శక్తులు నేడు చరిత్రను కప్పిపుచ్చి ప్రజలు చేసిన త్యాగాలను చెప్పకుండా చేసే అబద్ధపు ప్రయత్నాలను ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి జాడి పోచం, పులి శంకర్, దాగం రాయలింగు, దుర్గం పోశం, గోదారి లింగమూర్తి, బండారి సత్తయ్య పాల్గొన్నారు.



ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2వ విడత పథకం ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2వ విడత పథకాన్ని దేశ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ఇతర ప్రముఖులతో కలిసి ఒడిషా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుండి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా హౌసింగ్ నోడల్ అధికారి పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో నివాసముంటున్న పేదలు, ఆర్థికంగా వెనకబడిన వర్గాలు, మధ్యతరగతి కుటుంబాల వారి కోసం కేంద్ర ప్రభుత్వం కోటి గృహాలను అందించేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు.



ఈ పథకం ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పురపాలక సంఘాల పరిధిలోని ఆర్థికంగా వెనకబడిన పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పథకం విధివిధానాల ప్రకారం నిబంధనల మేరకు అర్హులైన లబ్దిదారులకు పథకం ఫలాలు అందించే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కాగజ్‌నగర్ మండలంలోని వివిధ పాఠశాలల్లో చేపట్టారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ పీఆర్‌సీ నివేదిక తెప్పించుకొని జాప్యం లేకుండా అమలుకు ప్రభుత్వం ముందుకు రావాలని అన్నారు. హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. సర్వశిక్షా అభియాన్, కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు, ఆశ్రమ, మరియు గురుకులాలలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్‌టీలకు, గెస్ట్, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 12 నెలల వేతనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లలిత, సభ్యులు రాజకమలాకర్‌రెడ్డి, వేణి, సబిత పాల్గొన్నారు.

రాజీవ్ నగర్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రాజీవ్ నగర్ పంచాయతీలో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యత గల ప్రతి ఒక్కరు పచ్చదనం పరిశుభ్రత పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, నందకుమార్, పంచాయతీ సెక్రటరీ రమాదేవి పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ పర్యటన

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి వెంకటేశ్వరరెడ్డి ఏరియాలో పర్యటించారు. మంగళవారం కేకే ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత వివరాలు తెలుసుకున్నారు. ఏరియా జీఎం దేవేందర్‌తో గని లోపలికి వెళ్లి పని స్థలాలను పరిశీలించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు. ఎల్లప్పుడూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తూ ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, గని మేనేజర్ రామరాజు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం భగవాన్ విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలాజీనగర్‌లోని బ్రహ్మంగారి ఆలయంలో విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేతి వృత్తుల ద్వారా కళలను సజీవంగా ఉంచే ప్రయత్నంలో విశ్వకర్మ సోదరులు కృషి చేస్తున్నారని అన్నారు. వారి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సోదరులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దండేపల్లి : విశ్వబ్రాహ్మణ సంఘం ఆద్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జయంతి ఉత్సవాన్ని పురష్కరించుకుని ఆ సంఘ నాయకులు పంచ రంగుల జెండా ఎగురవేసి ఆయన చిత్ర పఠానికి పూల మాలా వేసి నివాళ్లు అర్పించారు. ఈ సంధర్భంగా పలువురు మాట్లాడుతూ విశ్వకర్మతోనే సృష్టి ఉద్భవించిందని విశ్వకర్మ జయంతిని పండుగలా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు శ్రీకాంత్, కట్ట శ్రీధర్ కరుణాచారి, కట్ట వెంకటేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, జనార్ధన్, సత్తయ్య, సురేష్, బ్రహ్మం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాపాలన దినోత్సవం

నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాడావి గంగారాం జాతీయ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ భోజన్న జెండా ఆవిష్కరించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, సూపరిడెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీ నారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, శ్రీదేవి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విమోచన దినోత్సవం


ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ అధికారంలో ఉండి కూడా విమోచన దినోత్సవ వాస్తవాన్ని గుర్తించలేక పోయాయని ఎంపీ గోడం నగేష్ ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూజలు చేసినంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించకపోయిన మూడేండ్లుగా పీఎం పిలుపు మేరకు జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా సంవత్సర కాలం పాటు తెలంగాణ నిజాం పాలనలో ఉండేదన్నారు. తరువాత తెలంగాణ భారత దేశంలో వీలినం అయిందని, ఆ రోజునే విమోచన దినంగా జరుపుకుంటున్నట్టు తెలిపారు.

హామీని విస్మరించారు..

ఎమ్మెల్యే పాయల మాట్లాడుతూ నిజాం పాలన నుంచి విముక్తి అయిన రోజును విమోచన దినంగా జరుపుతామని అధికారంలోకి రాకముందు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్న, ఆదినాథ్, వేదావ్యాస్, ఆకుల ప్రవీణ్, బీంసేనరెడ్డి, దయాకర్, దినేష్ మటోలియ, నగేష్, శ్రీనివాస్, రమేష్, దత్తు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో...

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పట్టణశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు స్థానిక నేతాజీ చౌక్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ఏబీవీపీ పూర్వ నాయకులు దుర్శెట్టి నిఖిల్ పాల్గొని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భారతమాత నేతాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పట్టణాధ్యక్షులు డాక్టర్.రవికుమార్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజానీకం విమోచన లభించిన సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినం వేడుకలు తెలంగాణ అంతట పండుగ వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కుమురంభీం, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్వాయి పాపన్న మొదలగు నాయకులు వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసి ప్రాణాలను కోల్పోయారని అన్నారు. వారందరినీ స్మరిస్తూ ఆ మహనీయులకు ఘనంగా నివాళులర్పించాలని కోరారు. దేశ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఖాద్వే అక్షయ్, పూర్వ కార్యకర్తలు కార్తీక్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

ముథోల్ : ముథోల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణలో పెద్ద పోరాటం జరగడంతో రజాకార్ల నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందని అన్నారు. ప్రతి సంవత్సరం తెలంగాణలో విమోచన దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సాగౌడ్, తాటివార్ రమేష్, సాయన్న, సప్పటొల్ల పోతన్న, శ్రీనివాస్, భూమేష్, లక్ష్మి నారాయణ, మోహన్ యాదవ్, సాయినాథ్, అంబర్ సింగ్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని గణేష్ మండపాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గణేష్ మండపాల కార్యకర్తలు సహకరించి శాంతియుతంగా వినాయకుల నిమజ్జనం చేయాలని ఆయన కోరారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వినాయకుడికి తొమ్మిది రోజుల పూజల అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాండ్ మేళాలు, డీజేలతో భక్తులు నృత్యాలు చేస్తూ గణనాథుడికి వీడ్కోలు పలికారు. ఆయా మండపాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నస్పూర్ : వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద వినాయక నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనానికి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. శోభయాత్ర కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ సామరస్యంతో నిమజ్జన కార్యక్రమాన్ని జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మండల నాయకులు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు తొడసం బండు, ఉపాధ్యక్షులు రాథోడ్ బిక్కు మాట్లాడుతూ ఆగస్టు 15 ఎంత ముఖ్యమో సెప్టెంబర్ 17 కూడా అంతే ముఖ్యమని తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్రం నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను నిజాం చెరిపేసే ప్రయత్నం చేశారన్నారు. ఉద్దేశపూర్వకంగా చరిత్రను తొక్కి పెట్టి మహనీయులు స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలు, బలిదానాలు దాచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

జిల్లాలో ఘనంగా ముగిసిన నిమజ్జన వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ టౌన్

ఉమ్మడి జిల్లాలో వినాయక నిమజ్జన పర్వం జరిగింది. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణపయ్యలు మంగళవారం రాత్రి గంగమ్మ ఒడికి చేరారు. ఉదయం నుంచి ప్రారంభమైన నిమజ్జన శోభాయాత్ర బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన నిమజ్జన వేడుకల్లో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం వినాయకుడి విగ్రహానికి పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలో కొలువైన వినాయక విగ్రహాలు పురవీధుల గుండా శోభాయాత్రగా బయలుదేరాయి. డీజేలు, బ్యాండు చప్పుళ్ల మధ్య యువత, మహిళలు, చిన్నారులు నృత్యాలు చేస్తూ వినాయకుడిని గంగమ్మ ఒడికి చేర్చారు.

కనుల పండువగా శోభాయాత్ర

ఆదిలాబాద్ పట్టణంలో వినాయక శోభాయాత్ర కనుల పండువగా సాగింది. పట్టణంలో కొలువైన గణపయ్యలు ఉదయం నిమజ్జనానికి బయలుదేరగా.. ఈ పర్వం మరుసటి రోజు వరకు సాగింది. ఈ శోభాయాత్రను తిలకించేందుకు పట్టణవాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటుచేశారు. వెయ్యి మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించగా.. 200 సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘాను ఏర్పాటుచేశారు.

ఆదిలాబాద్‌టౌన్ : హిందూ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలను జరుపుకుంటూ హైందవ ధర్మం గొప్పతనాన్ని చాటాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం వినాయక్‌చౌక్‌లోని సర్వస్వతి శిశు మందిర్‌లో గణేష్ నిమజ్జన సార్వజనిక్ శోభాయత్రను కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయల శంకర్, ఎస్పీ గౌస్ ఆలంలతో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మట్టి వినాయకున్ని ఉంచి జెండా ఊపి శోభాయాత్రలో ముందుకు సాగారు. ముందుగా శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ పది రోజుల పాటు హిందూ సమాజం సభ్యులు గణేష్ ప్రతిష్ఠించి పూజలు చేసి భక్తిని చాటారన్నారు. భిన్నత్వంలో ఏకత్వంలా ఉంటూ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఐక్యంగా ఉంటూ దేశ సమైక్యతను పెంచాలన్నారు. ఉత్సవ సమితి, పోలీసుల సూచనలు పాటిస్తు మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, భక్తి కనబర్చేలా నిమజ్జనం జరుపుకోవాలని సూచించారు.

ప్రతి శుభకార్యం వినాయకుడితోనే ప్రారంభం...

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రతి శుభ కార్యక్రమం వినాయకుడి పూజతోనే ప్రారంభమవుతుందని, పది రోజుల పాటు పూజలు అందించి, నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా ఘనంగా జరుపుకోవాలని సూచించారు. పట్టణంలో 6 నుంచి 7 వందల వరకు వినాయకులను ప్రతిష్టించారని, జిల్లా వ్యాప్తంగా 12 వందలకు పైగా ప్రతిష్టపనలు జరిగాయన్నారు. ఆదిలాబాద్ లో జరిగే ఉత్సవాలను చరిత్ర ఉందని దీన్ని ఇలానే కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత ఆదిలాబాద్ గణేష్ ఉత్సవాల్లో రెండవ స్థానం సాధించిందని దాన్ని అలానే కొనసాగిస్తు ముందుకు సాగాలని అన్నారు. మనతో పాటు పక్కన వారిని కూడా సంతోషంగా ఉంచమే సనాతన ధర్మమని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు నిమజ్జనాన్ని జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, ప్రముఖ వ్యాపార వేత్త భజరంగ్‌లాల్ అగర్వాల్, ప్రధాన వక్త ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ వెంకట శశికుమార్, హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు బొంపెల్లి హన్మండ్లు, ప్రధాన కార్యదర్శి కోరెడ్డి లెనిన్, సంఘటన మంత్రి ఇత్వూర్ భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్‌లో మంగళవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నిమజ్జనం కోసం స్థానిక పెద్దవాగు వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. సాయంత్రం 6 గంటల తర్వాత నుండి అన్ని గణేష్ మండపాల వద్ద సందడి మొదలైంది. వివిధ గణేష్ మండళ్ల నిర్వాహకులు, కాలనీ వాసుల నృత్యాల మధ్య గణేష్ శోభాయాత్ర ప్రారంభమైంది. పెద్ద వాగులో నీరు తక్కువగా ఉండడంతో గణేష్ విగ్రహాలు నీటిలో తేలియాడుతూనే ఉన్నాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డీఎస్పీలు రామానుజం, కరుణాకర్ బందోబస్తు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు లారీ చౌక్‌లో, ఎమ్మెల్సీ దండే విఠల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్థానిక పెట్రోల్ పంప్‌లో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఇంద్రవెల్లి : మండలంలోని దబ్బగూడ గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో గణేష్ నిమజ్జనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా గణేషుడికి ప్రత్యేక పూజలు చేశారు. రాయల్ ఖోరీ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసులు డోలు, డప్పుల చప్పుళ్లతో కోలాటం నృత్యం చేస్తూ గణేషుడి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు.

ఖానాపూర్ : 11 రోజులు ఘనంగా పూజలు అందుకున్న గణనాథులు మంగళవారం నిమజ్జన శోభాయాత్రకు


కాగజ్‌నగర్

సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని ఒకటో నెంబర్ శ్రీరామ్ నగర్ వినాయకుడు, అంబేద్కర్‌నగర్, సాయినగర్, శివాజీనగర్, శాంతినగర్, పద్మావతినగర్, విద్యానగర్, సుభాష్‌నగర్, గాంధీనగర్, అశోక్ నగర్ ఆయా గణపతులు శోభాయాత్రకు సిద్ధంగా ఉన్నాయి. గణనాథులను అందంగా అలంకరించి రంగురంగుల విద్యుత్ దీపాలు పెట్టి శోభాయాత్రకు సిద్ధంగా తయారు చేశారు. ఈ శోభాయాత్ర ఖానాపూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ మీదుగా శాంతినగర్ నుండి శివాజీ నగర్ శ్రీరామ్ నగర్ గోదావరి వరకు కొనసాగుతుంది. ఈ శోభాయాత్రకు ఖానాపూర్ మండలంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. అంతేకాకుండా శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఖానాపూర్ సిఐ సైదారావు ఎస్సై లింబాద్రి, ఆయా శాఖల అధికారులు, హిందూ ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో ఈ శోభాయాత్ర జరుగుతుంది.

తాంసి : మండలంలోని హస్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బొరుసు గ్రామానికి చెందిన దినేష్ అనే యువకుడు సోమవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా గ్రామస్తులతో గొడవపడి అర్ధరాత్రి కత్తితో గ్రామంలో హల్చల్ చేశాడు. పోలీసులు గ్రామస్తుల వివరాల ప్రకారం గణేష్ నిమజ్జనం సమయంలో రాత్రి ఒంటిగంట సమయంలో మద్యం మత్తులో యువకుడు స్థానికులతో గలాటా చేశాడు. అనంతరం కత్తితో యువకుడు స్నేహితులతో కలిసి గ్రామస్తులను బెదిరించాడు. గ్రామస్తులకు ఎవరికి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పిందని అన్నారు. దీంతో గ్రామస్తులు మూకుమ్మడిగా మంగళవారం తాంసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దుండగులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివరాం వెల్లడించారు.

సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం..

హస్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బొరుసు గ్రామంలో కత్తితో దాడి చేసి ఓ యువకుడు గ్రామస్తులను గాయపరిచినట్టు సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేశారని, ఎస్సై శివరాం ఖండించారు. మద్యం మత్తులోని ఆ యువకుడు గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేశాడని అన్నారు. గలాటాలో ఎవరికి గాయాలు కాలేదని, దుండగులపై కేసు నమోదు చేయగా సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేయవద్దని సూచించారు.